విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 262 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 11 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్

### ప్రధాని మోదీ వ్యాఖ్య

దిల్లీ: ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మ విశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన 'బస్తర్ పండుమ్'పై ఆయన ప్రశంసలు

- మిగతా2లో



## దేశ ప్రయోజనాలను మోదీ తాకట్టు పెట్టారు

### అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఖర్గే

దిల్లీ: భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ఈ ఒప్పందం భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని, మోదీ ప్రభుత్వ ద్రోహాన్ని బయట పెట్టిందని విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని 'బలవంతంగా లొంగిపోవడమే' అంటూ మంగళవారం 'ఎక్స్' వేదికగా ఖర్గే పోస్టు పెట్టారు.

- మిగతా2లో




# పోలవరానికి సహకరించండి

- రెండో దశకు రూ.32 వేల కోట్లు కేటాయించండి
- గోదావరి జల వివాదాలపై ట్రైబ్యునల్
- రాజధాని అమరావతికి చట్టబద్ధత
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం, ప్రోత్సాహక నిధులు
- బెంగళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌కు తిరుపతితో అనుసంధానం
- కేంద్రానికి సీఎం చంద్రబాబు వినతులు
- దిల్లీలో ఏడుగురు కేంద్రమంత్రులతో భేటీ



పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తికావస్తున్న నేపథ్యంలో రెండో దశకు అవసరమైన భూసేకరణ, పునరావాసం, రక్షణ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలిపారు. ఇందుకోసం అదనంగా రూ.32 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ కారణంగా ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఈ ఉత్తర్వును ఏటా పొడిగించడానికి బదులు శాశ్వతంగా ఎత్తివేయాలి. పోలవరం కుడి, ఎడమ ప్రధాన

- మిగతా2లో



## స్పీకర్‌పై అవిశ్వాసం

- ఆయన తొలగింపునకు 118 మంది ఎంపీల నోటీసు
- ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- చర్చ పూర్తయ్యేవరకు విధులకు దూరంగా సభాపతి
- నిబంధనల మేరకు చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశం

దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలో 118 మంది విపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు సమర్పించారు. సభను నిర్వహించడంలో బిర్లా తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులపై ఆయన కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని కూడా దానిలో

- మిగతా2లో

## ఆ భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం



- చంద్రబాబు ప్రభుత్వం జీఎస్‌డీపీపై తప్పుడు లెక్కలు చెబుతోందని జగన్ ఆరోపణ
- 11.75 శాతం వృద్ధి అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శ
- 'కాగ్' లెక్కల ప్రకారం రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి కేవలం 1.97 శాతం మాత్రమేనని వెల్లడి
- పన్నుల వసూళ్ల వృద్ధిలో 23 రాష్ట్రాల్లో ఏపీకి 22వ స్థానం లభించిందని ఎద్దేవా
- అప్పులు, అవినీతి, కక్ష సాధింపుల్లోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందని తీవ్ర విమర్శ

- మిగతా2లో



## 17న భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

దిల్లీ: మూడు రోజుల పర్యటన కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈ నెల 17న భారత్ రానున్నారు. ఆయన ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. వాణిజ్యం, రక్షణ వంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు దృష్టిసారిస్తారు. మెక్రాన్ 17న ముంబయిలో అడుగుపెడతారు. అక్కడ

- మిగతా2లో

## అమెరికాతో బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

### ఢాకా ఉత్పత్తులపై 1 శాతం తగ్గిన సుంకాలు

ఢాకా: అమెరికా, బంగ్లాదేశ్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. దీంతో బంగ్లాపై సుంకాలు ప్రస్తుతమున్న 20 శాతం నుంచి.. 19 శాతానికి తగ్గనున్నాయి. అమెరికా

- మిగతా2లో



## విద్యార్థులకు శుభవార్త చెప్పిన మంత్రి నారా లోకేశ్

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం రూ. 1,200 కోట్లు విడుదల
- రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అందనున్న తక్షణ ప్రయోజనం
- బకాయిలన్నీ చెల్లించి, ఇకపై సకాలంలో సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ
- చదువులకు ఎలాంటి ఆటంకాలు ఉండవని మంత్రి నారా లోకేశ్ భరోసా



ఆంధ్రప్రదేశ్‌లోని లక్షలాది మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం రూ. 1,200 కోట్లను విడుదల చేసినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రకటించారు. తాజాగా బ్యాంకు విడుదల ఉత్తర్వుల ద్వారా ఈ నిధులను తక్షణమే విడుదల చేస్తున్నామని, దీనివల్ల విద్యార్థులకు వెంటనే లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు

- మిగతా2లో

## విశాఖ మెట్రో.. ముందడుగు

### విజయవాడ ప్రాజెక్టుకూ త్వరలో అనుమతి

రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు కదలిక వచ్చింది. విశాఖపట్నం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు సంబంధించి ముందడుగు పడింది. కొన్ని మార్పుచేర్పుల తర్వాత దీనిపై కేంద్రం నుంచి త్వరలో మరింత స్పష్టత రానుంది. విజయవాడ మెట్రోకు కొన్ని సవరణలను పరిశీలిస్తోంది. దానికీ త్వరలోనే ఆమోదం వెలువడనుందని తెలుస్తోంది. రెండు నగరాల్లోనూ రెండుదశల్లో మెట్రో ప్రాజెక్టుల కోసం రాష్ట్రప్రభుత్వం మొత్తం రూ.42,362 కోట్లతో ప్రాజెక్టు నివేదికలు

- మిగతా2లో



## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 14న రాష్ట్ర బడ్జెట్
- తొలి రోజు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- 20కిపైగా ప్రాధాన్య అంశాలపై చర్చకు సిద్ధమైన అధికారపక్షం
- తొలిరోజు సమావేశానికి హాజరవ్వాలని వైకాపా నిర్ణయం



# పోలవరానికి సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్ చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లోని కరవు పీడిత ప్రాంతాల అవసరాలు తీర్చే పోలవరం- నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా అనుమతులు మంజూరు చేయాలి. దీనికి ఆర్థిక సాయం అందించాలి. ఆంధ్రప్రదేశ్- ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరిస్తూ వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును గెజిట్‌లో ప్రచురించి, ఆ నదిపై నిర్మించ తలపెట్టిన నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలి. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాద పరిష్కారానికి గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. ఎగువ కృష్ణాపై ఆలమట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలను అడ్డుకోవాలి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వర్తించే పథకాలు, ప్రాజెక్టులు, నిధులు, ఆర్థిక సాయం గురించి చర్చించేందుకు చంద్రబాబు దిల్లీకి వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడుగురు కేంద్ర మంత్రులతో విడివిడిగా భేటీ అయ్యారు.

**అమరావతికి చట్టబద్ధతతో అభివృద్ధికి ఊతం**

హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమైన చంద్రబాబు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే అంశంపై చర్చించారు. దానివల్ల పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగి అమరావతి, చుట్టుపక్కల ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడానికి వీలవుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను అమిత్‌షాకు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు శ్రీవారి ప్రతిమను అందిస్తున్న చంద్రబాబు. చిత్రంలో ఉదయ్ శ్రీనివాస్, శ్రీకృష్ణదేవరాయలు, రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్, పయ్యావుల

రెవెన్యూ లోటు గ్రాంటుకు ప్రత్యామ్నాయం చూపండి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో ఆర్థిక వనరులపై సీఎం ప్రధానంగా చర్చించారు. 16వ ఆర్థిక సంఘం రెవెన్యూ లోటు గ్రాంట్ల విధానాన్ని రద్దు చేయడంతో ఏపీ తీవ్రంగా నష్టపోతోందని, ఆ లోటును భర్తీ చేసేందుకు కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థిక సాయమందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు అమలు చేసినందుకు రాష్ట్రానికి రావాల్సిన ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. మూలధన వ్యయం కోసం కేంద్రం వడ్డీ లేని రుణాల కింద అందిస్తున్న ప్రత్యేక సాయాన్ని పెంచాలని కోరారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు వివిధ కేంద్ర శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే తెప్పించుకొని 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి విడత నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకం మార్గదర్శకాలను త్వరగా ఖరారు చేసి, దాని కింద రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు.

**ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించండి**

భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిన చంద్రబాబు వైజాగ్ స్టీల్ ప్లాంట్ తాజా పరిస్థితిని వివరించారు. కేంద్రం ఇచ్చిన చేయూతతో జనవరిలో ఆ సంస్థ లాభాలు నమోదు చేసిందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వపరంగా చేయూతనివ్వాలని కోరారు.

**స్వచ్ఛభారత్ కింద ఏపీకి నిధులివ్వండి**

ఆంధ్రప్రదేశ్‌ను బహిరంగంగా వ్యర్థాల గుట్టలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నందున అందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని స్వచ్ఛభారత్ మిషన్ కింద అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద రూ.276 కోట్లతో డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరిచారు.

# ఆ భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం

వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు.ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025-26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు.ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు.ఇదే సమయంలో,

దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు '22వ ర్యాంక్ విజన్' అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. మరోవైపు తొలిరోజు గవర్నర్ ప్రసంగం వరకు మాత్రం సభకు హాజరవ్వాలని వైకాపా నిర్ణయించింది. తర్వాత సమావేశాలకు ఆ పార్టీ సభ్యులు హాజరవుతారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపచారానికి పాల్పడడంపై, పరకామణిలో చోరీని సెటిల్‌మెంట్ చేసిన ఘోరం సహా... ఇతర అంశాలపైనా సభా వేదికగా చర్చించేందుకు అధికార పక్షం సిద్ధమవుతోంది. అమరావతి నిర్మాణంలో పురోగతి, సూపర్-6 అమలు, పెట్టుబడులు, సంక్షేమానికి ప్రాధాన్యం, విద్యా రంగంలో సంస్కరణలు, సామూహిక గృహప్రవేశాలు వంటి మొత్తం 20కిపైగా ప్రాధాన్య అంశాలపై చర్చించాలని అధికార తెదేపా బీఏసీ సమావేశంలో కోరనుంది. గతేడాది మాదిరిగానే ఇప్పుడు కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. మార్చి 5 నుంచి 7 వరకు ఈ పోటీలు ఉండనున్నాయి. బడ్జెట్ సమావేశాలు మార్చి 12 వరకు కొనసాగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలని ఆహ్వానించారు. సమావేశాలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. స్పీకర్‌తోపాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ కూడా ఉన్నారు. గవర్నర్ ప్రసంగం ముగిశాక తొలిరోజు సభ వాయిదా పడనుంది. తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా మండలి(బీఏసీ) సమావేశం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన చేపట్టనున్నారు. ప్రస్తుత సమావేశాలకు సంబంధించి ఎజెండాను, ఏ రోజు ఏ చర్చ చేపట్టాలనేది, మొత్తమ్మీద ఎన్ని పని దినాలు సమావేశాలు నిర్వహించాలనేదీ అందులోనే ఖరారు చేస్తారు.

**సమావేశాలిలా..!**

ప్రాథమిక సమాచారం మేరకు తొలిరోజైన బుధవారం గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా పడనుంది.

12, 13 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, చివర్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఉంటాయి.

14న ప్రభుత్వం సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

శివరాత్రి నేపథ్యంలో 15(ఆదివారం), 16న సెలవు ఇచ్చే అవకాశం.

17 నుంచి రెండు మూడు రోజులపాటు బడ్జెట్‌పై సాధారణ చర్చ.

ఆ తర్వాత శాఖల వారీగా గ్రాంట్లు, డిమాండ్లపై చర్చ కొనసాగే అవకాశం.

ఈ సమావేశాల్లో ప్రభుత్వం నాలుగు ఆర్డినెన్సుల స్థానంలో బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది.

# స్పీకర్‌పై అవిశ్వాసం

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 94(సి) అధికరణం కింద లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్, చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మహమ్మద్ జావెద్ తదితరులు నోటీసును అందజేశారు. కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, వామపక్షాలు, ఆర్జేడీ, శివసేన-యూబీటీ, ఎన్సీపీ-ఎస్పీ తదితర పార్టీల సభ్యులు దీనిపై సంతకాలు చేశారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ మాత్రం సంతకం చేయలేదు. తృణమూల్ తరఫున ఎవరి ప్రాతినిధ్యం లేదు. నిబంధనల ప్రకారం ఈ అంశంపై చర్చ పూర్తయ్యేవరకు సభకు రాకూడదని ఓం బిర్లా నిర్ణయించుకున్నారు. 1) నరవణె రచించిన పుస్తకంపై మాట్లాడేందుకు రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం 2) మాజీ ప్రధానమంత్రులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు తీసుకోకపోవడం 3) ఎనిమిది మంది ఎంపీలను సస్పెన్షన్‌లో ఉంచడం.. ఈ మూడింటికి నిరసనగా స్పీకరుపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని విపక్షం తీర్మానించింది. కొందరు కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చన్న పక్కా సమాచారంతో సభకు రావద్దని ప్రధానికి తానే సూచించినట్లు స్పీకర్ ఇటీవల చెప్పడం కూడా ప్రతిపక్షాలకు ఆగ్రహం కలిగించింది.

**మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదు: గొగొయ్**

స్పీకర్‌పై వ్యక్తిగత గౌరవం ఉన్నా అసాధారణ పరిస్థితుల్లోనే అవిశ్వాస తీర్మానం తీసుకురావాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాత్రమే కాకుండా చాలా సందర్భాల్లో రాహుల్‌గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. న్యాయసమ్మతమైన ప్రజా సంబంధిత అంశాలు లేవనెత్తనీయకుండా స్పీకర్ తమను అడ్డుకుంటున్నారని విమర్శిస్తున్నాయి. విపక్ష నేతలు ముందుగా రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమై నోటీసుపై తుది నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఇచ్చిన నోటీసును మధ్యాహ్నం వెనక్కి తీసుకుని, తేదీని సరిచేసి మరొకటి ఇచ్చారు. నోటీసును పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని సెక్రటరీ జనరల్‌ను స్పీకర్ ఆదేశించారు. విరామం తర్వాత జరిగే రెండో విడత సమావేశాల్లో మార్చి 9న ఇది సభ పరిశీలనకు రానుందని సమాచారం. తీర్మానం చర్చకు వస్తే స్పీకర్ తన వాదన వినిపించేందుకు అవకాశం లభిస్తుంది. ముందుగా స్పీకర్‌కు లేఖరాసి అభ్యంతరాలను తెలియజేయాలని, 2-3 రోజుల్లో స్పందన రాకపోతే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని తృణమూల్ కాంగ్రెస్ అభిప్రాయం.

**బడ్జెట్‌పై మొదలైన చర్చ**

లోక్‌సభలో మంగళవారం విపక్ష నిరసనలు కొనసాగాయి. ప్రశ్నోత్తరాల సమయంలోనూ నినాదాలు ఆగలేదు. సభాపతి స్థానాన్ని విపక్ష సభ్యులు చుట్టుముట్టి ఆందోళన వ్యక్తంచేశారు. అయితే మధ్యాహ్నం తర్వాత బడ్జెట్‌పై చర్చను ప్రారంభించగలిగారు. రాత్రి 8 గంటల వరకు పలువురు సభ్యులు మాట్లాడారు. భాజపాయేతర పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన (యూబీటీ) సభ్యులు ఆరోపించారు. పన్నులు, ద్రవ్యోల్బణం ద్వారా పేదల్ని దోచుకుని కుబేరులకు మాత్రం రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. పుట్టుక నుంచి చావు వరకు ప్రతిదశలో వాడే వస్తువులపైనా పన్ను పడుతోందన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యాహ్నం మాట్లాడే అవకాశం ఉంది. చర్చను విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రారంభించాలని పలువురు విపక్షనేతలు కోరుకున్నా తాను అలాచేస్తే అధికారపక్షం 'కల్పిత అవాంతరాలతో' కీలకచర్చను పక్కదారి పట్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. బుధవారం ఆయన మాట్లాడే అవకాశం ఉంది.

# సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్

-మొదటిపేజీ తరువాయి

కురిపించారు. ఈ వేడుకలో బస్తర్ ప్రాంతపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'గతంలో బస్తర్ అనగానే మావోయిజం, హింస, వెనుకబాటుతనం గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు బస్తర్ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. స్థానిక ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఈ ప్రాంతం భవిష్యత్తులోనూ శాంతి, ప్రగతి, సాంస్కృతిక గౌరవంతో నిండి ఉండాలని నేను ఆశిస్తున్నాను'

అని 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు పెట్టారు. ఈ నెల 7న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించిన ఈ ఉత్సవం, గిరిజనులు హస్తకళలు, స్థానిక వంటకాలు, సంప్రదాయ గిరిజన నృత్యాలు, జానపద గీతాలతో బస్తర్ వైభవాన్ని చాటి చెప్పింది.

# విద్యార్థులకు శుభవార్త చెప్పిన మంత్రి నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మా హామీ ఒక్కటే. ఇకపై చదువులకు ఎవరికీ ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించి, భవిష్యత్తులో సకాలంలో సాయం అందించడమే మా ప్రభుత్వ స్పష్టమైన నిబద్ధత," అని వివరించారు.ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. "మీ ప్రభుత్వం మీకు తోడుగా ఉంది, మీరంతా ధైర్యంగా చదువుకోండి" అని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ నిధుల విడుదలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# విశాఖ మెట్రో.. ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

తయారుచేసింది. వీటిలో మొదటిదశ పనులకు రెండుచోట్లా కలిపి రూ.22,507 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు వేశారు. విశాఖ ప్రాజెక్టుకు రూ.11,498 కోట్లు, విజయవాడ ప్రాజెక్టుకు రూ.11,009 కోట్లు ప్రతిపాదించారు.

**ఈక్విటీ షేర్‌లో సగానికి కేంద్రం ఓకే**

మెట్రో రైలు కొత్త పాలసీ-2017 ప్రకారం విశాఖ ప్రాజెక్టుకు మొత్తం ఈక్విటీ షేర్ 40%లో కేంద్రం 20% నిధులు సమకూర్చేందుకు అంగీకరించింది. మిగతా 20% నిధులు రాష్ట్రప్రభుత్వం పెట్టుకోవాలి. తొలిదశలో రూ.11,498 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టు అంచనా వ్యయంలో 40% ఈక్విటీ షేర్‌గా నిర్ణయించారు. మిగతా 60% నిధులు ఏడీబీ, ఏఐఐబీ, ప్రపంచబ్యాంకుల నుంచి సాఫ్ట్‌లోన్‌గా సేకరిస్తారు. ఇందుకు కేంద్రం హామీ ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం 30 ఏళ్లలో రుణం తిరిగి చెల్లించాలి.

విశాఖలో తొలిదశలో మూడు కారిడార్లు ప్రతిపాదించారు. స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది కూడలి వరకు, రెండోది గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు, మూడోది తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు కలిపి మొత్తం 46.23 కిలోమీటర్లలో కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు.

రెండోదశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 30.67 కిలోమీటర్లలో మరో కారిడార్ ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.5,734 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవుతున్నందున తొలిదశలోనే కొమ్మాది-భోగాపురం మధ్య కారిడార్‌కు కేంద్రం ఆమోదం కోసం యత్నిస్తున్నారు. ఈ ప్రతిపాదన కేంద్రం నుంచి కూడా వచ్చినట్లు తెలుస్తోంది.

**విజయవాడలో దుర్గగుడి వరకు కారిడార్ల విస్తరణ**

విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రెండు ప్రధాన ఎలివేటెడ్ కారిడార్లను దుర్గగుడి వరకు విస్తరించే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఇందుకు అధికారులు ప్రాథమికంగా అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక పంపారు. పీఎన్‌బీఎస్ నుంచి గన్నవరం, పెనమలూరు వరకు వేర్వేరుగా రెండు కారిడార్లు మొదట ప్రతిపాదించారు. దుర్గగుడి వరకు వాటిని విస్తరించి బస్టాండ్ మీదుగా వెళ్లేలా మార్పులు చేస్తే బాగుంటుందన్న కేంద్ర నిపుణుల సూచనలపై అధికారులు ఇటీవల పరిశీలించారు. దుర్గగుడి ముందు రోడ్డులో తగినంత ఖాళీ స్థలం లేదని, ప్రైవేటు స్థలాల సేకరణ చాలా వ్యయంతో కూడుకున్నదన్న విషయాన్ని కేంద్రానికి నివేదించారని తెలుస్తోంది.

రెండోదశలో బస్టాండ్ నుంచి రాజధాని అమరావతి వరకు కారిడార్ ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.14,121 కోట్లు అవసరమని అంచనా వేశారు. రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నందున.. ఈ కారిడార్ కూడా తొలిదశలోనే చేపట్టేందుకు అనుమతించే విషయాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరబోతోంది.

తెరుచుకోనున్న విశాఖ మెట్రో టెండర్లు: విశాఖ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో పనులకు పిలిచిన టెండర్లు తెరిచేందుకు మార్గం సుగమమైంది. రెండు నగరాల్లోనూ పనులకు టెండర్లు పిలిచినా డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నందున అధికారులు ఇప్పటివరకు టెండర్లు తెరవలేదు.

## అమెరికాతో బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

-మొదటిపేజీ తరువాయి

వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్, బంగ్లాదేశ్ వాణిజ్య ప్రతినిధి షేక్ బషీరుద్దీన్‌లు వాషింగ్టన్‌లో ఈ వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారని శ్వేతసౌధం సోమవారం ధ్రువీకరించింది. ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఇది ఓ గొప్ప ముందడుగని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం పేర్కొంది. దుస్తుల తయారీకి అమెరికా నుంచి దిగుమతయ్యే కాటన్, ఫైబర్‌లను ఉపయోగించేందుకు తాము అంగీకరించినట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఇలా తయారుచేసి ఎగుమతి చేసే దుస్తులకు అమెరికా మార్కెట్‌లో సుంకాలు ఉండబోవని పేర్కొన్నారు. గతంలో బంగ్లాదేశ్‌పై ట్రంప్ 37 శాతం టారిఫ్‌లు విధించగా.. తర్వాత దానిని 20 శాతానికి పరిమితం చేశారు. వాణిజ్య ఒప్పందంతో మరొక శాతం తగ్గించారు. 18 శాతం సుంకాలకు అంగీకరిస్తూ అమెరికాతో భారత్ ఇటీవల వాణిజ్య ఒప్పందం ఖరారు చేసుకుంది. దీంతో వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థిక వ్యవస్థ అయిన బంగ్లాదేశ్.. భారత్ కంటే తక్కువ సుంకాలతో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు యత్నించింది. అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, వైద్య పరికరాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఇంధన ఉత్పత్తులకు మార్కెట్‌ను తెరిచేందుకు ఢాకా అంగీకరించింది.

# 17న భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

-మొదటిపేజీ తరువాయి

మోదీతో కలిసి 'ఇండియా-ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ప్రారంభిస్తారు. ఇద్దరు నేతలు ముంబయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. "హొరైజన్- 2047 మార్గసూచీలో పేర్కొన్న అంశాలపై మోదీ, మెక్రాన్ సమాలోచనలు జరుపుతారు" అని భారత విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. హొరైజన్ మార్గసూచీని 2023లో మోదీ, మెక్రాన్‌ల మధ్య జరిగిన చర్చల సమయంలో ఆవిష్కరించారు. 19న దిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో మెక్రాన్ పాల్గొంటారు. భారత్‌కు 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు మెక్రాన్ పర్యటన సమయంలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3.25 లక్షల కోట్లు. ఇది ఖరారైతే దేశ చరిత్రలో అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలవనుంది.

## దేశ ప్రయోజనాలను మోదీ తాకట్టు పెట్టారు

-మొదటిపేజీ తరువాయి

'వాణిజ్య ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వం దేశ వ్యూహాత్మక ప్రయోజనాలను పణంగా పెట్టింది. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలోని నిజాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. 25 శాతం అదనపు సుంకాలు తగ్గించేందుకు రష్యా నుంచి ఇంధనం కొనుగోలు ఆపడానికి భారత్ అంగీకరించినట్లు శ్వేతసౌధం ప్రకటన స్పష్టం చేస్తోంది. చరిత్రలో తొలిసారిగా భారత వ్యవసాయ మార్కెట్‌లో విదేశీ ఉత్పత్తులకూ కేంద్రం ద్వారాలు తెరిచింది. ఇది దేశ రైతులను మోసం చేయడమే. మోదీ నిర్ణయంతో ఇక్కడి పాడి రైతులు నష్టపోతారు. జౌళి రంగం దెబ్బతింటుంది. వాణిజ్య ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయం ఇదేనా' అని ఖర్గే దుయ్యబట్టారు.

# ప్రజా ప్రతినిధులకు మూడు రోజుల పాటు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** అసెంబ్లీ సమావేశాల్లో ఆటవిడుపుగా ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదేశించారు. ప్రజా ప్రతినిధులకు క్రీడాపోటీల నిర్వహణ పై సన్నద్ధత పై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్చి 5, 6, 7 తేదీల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆటవిడుపు కలిగించాలని క్రీడలు, సాంస్కృతిక విభాగాల అధికారులకు సూచించారు. క్రీడా పోటీల విభాగంలో పాల్గొనటానికి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆసక్తి కనపర్చుతున్నారని, అంతే కాకుండా సాంస్కృతిక కార్యక్రమంలో కూడా పాల్గొనడానికి ఉత్సుకత చూపుతుండటం హర్షనీయమని అన్నారు. క్రీడల ఈవెంట్ నిర్వహణనకు శాసన సభ, శాసన మండలి చీఫ్ విప్ లు, విప్ లతో ఒక కమిటీ వేయాలన్నారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించే ప్రజా ప్రతినిధుల నిర్ణయించిన మూడు రోజుల్లో క్రీడాపోటీలను మధ్యాహ్నం నుండి జరపాలన్నారు. అలాగే కల్చరల్ కార్యక్రమాలు చివరి రోజు సాయంత్రం నుండి అహ్లాదవాతావరణంలో నిర్వహించేలా కల్చరల్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక



కార్యక్రమాలకు ఈ సారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరనున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పారు.

నిర్వహించనున్న క్రీడల వివరాలు: అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పందెం, క్యారమ్స్, చెస్, బాడ్మింటన్, టెబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, పికిల్ బాల్ పోటీలు నిర్వహించాలని ప్రాథమికంగా శాప్ అధికారులు స్పీకర్ అయ్యన్న పాత్రుడి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్కిట్స్, ట్రాక్ సింగింగ్ తదితర వీక్షకులను అలరించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ క్రీడాపోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహభరిత, ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉప సభాపతి కె. రఘురామ కృష్ణరాజు, రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విప్ యార్లగడ్డ వెంకట్రావ్, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే కూన రవికుమార్, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర,డైరక్టర్ ఫర్ కల్చర్ మల్లిఖార్జునరావు, శాప్ ఎండీ భరణి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు పై త్వరలోనే సుప్రీం కోర్టుకు నివేదిక ఎంపీ పుట్టా మహేష్ కుమార్



- కేంద్ర మంత్రి, సీఈసీ సభ్యులతో ఏలూరు ఎంపీ భేటీ.
- సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి.
- నివేదిక తయారు చేసి సుప్రీం కోర్టుకు పంపుతామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి.
- ఏలూరులో కోకో క్లస్టర్ అభివృద్ధికి చర్యలు.
- త్వరలోనే ఏలూరు రైతాంగానికి శుభవార్తలు.


**ఏలూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 10**: కొల్లేరు ఆక్వా రైతుల కష్టాలకు ముగింపు పలికే రోజు త్వరలోనే వస్తుందన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. మంగళవారం దిల్లీ లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను, కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సభ్యుడు సీపీ గోయల్ ను కలిసిన ఎంపీ కొల్లేరు సమస్య పై చర్చించారు. చర్చల సారాంశాన్ని వీడియో ద్వారా మీడియాకు విడుదల చేశారు. లక్షలాది ఆక్వా రైతుల, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన కొల్లేరు సమస్య పై దృష్టి పెట్టాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రికి ఇచ్చిన లేఖలో కోరినట్లు ఎంపీ తెలిపారు. ఈ సమస్య పై ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.వి. రామరాజు ఇచ్చిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖకు జత చేశారు. కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల నిర్ణయంలో సుదీర్ఘ జాప్యం జరుగుతుండటం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖలో సుప్రీం కోర్టు ఆదేశాలు, అనంతరం కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సందర్శించిన అంశాలను

ఎంపీ ప్రస్తావించారు. అయితే, సుప్రీం కోర్టు ఆదేశాల పరిధిని మించి సీఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అదనపు సమాచారం కోరడం వల్ల మరిన్ని సంక్లిష్టతలు ఏర్పడటమే కాకుండా, కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల హేతుబద్ధీకరణ పై జాతీయ వన్యప్రాణి మండలి ఇచ్చిన సూచనల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంపీ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా సమస్య పరిష్కరించని కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలోని తొమ్మిది మండలాల పరిధిలో 122 గ్రామాల్లో నివసిస్తున్న దాదాపు మూడు లక్షల మంది ప్రజలు వ్యవసాయం, మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ సమస్య వల్ల వారి జీవనోపాధి ప్రభావితమవుతోందని చెబుతూ సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా, అదే సమయంలో స్థానిక ప్రజల న్యాయసమ్మత హక్కులు, జీవనోపాధి కాపాడేలా కేంద్ర ప్రభుత్వం మానవీయ దృష్టితో జోక్యం చేసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎంపీ మాట్లాడుతూ కేంద్ర మంత్రి, సీఈసీ సభ్యులు కొల్లేరు సమస్య పట్ల సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొద్ది రోజుల్లో సమాచారం సుప్రీం కోర్టు నియమించిన సాధికారిక కమిటీకి చేరుతుందని,

అనంతరం నివేదిక తయారు చేసి సుప్రీం కోర్టుకు సమర్పిస్తామని వారు హామీ ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. కొల్లేరు రైతాంగానికి అనుకూలంగానే సుప్రీం కోర్టు తీర్పు వస్తుందనే అశాభావాన్ని ఎంపీ వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోనే ఎక్కువగా కోకో పంట సాగు చేస్తున్న ఏలూరు జిల్లాను కోకో హబ్ గా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, కోకో క్లస్టర్ ఏర్పాటుతో ఏలూరు జిల్లా కోకో ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మారబోతోందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

# మెరుగైన రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నాం వెలగపూడి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, పిబ్రవరి 10:**నగరంలో మెరుగైన రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొన్నారు. మంగళవారం విశాఖపట్నం తూర్పు నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో తారు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మరమ్మత్తులకు గురైన రహదారులను వర్షాకాలం రాక ముందే బాగు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోం దన్నారు. అందులో భాగంగానే పలు రహదారులకు శంఖుస్థాపనలు చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారులు ఎలా ఉన్నాయో ఇప్పుడు రహదారులు ఎలా ఉన్నాయో ప్రజలు గమనించాలని కోరారు. ఈ మార్పు తమ కూటమి ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శన మన్నారు. విశాఖకు కేంద్రం మెట్రో రైలు ప్రాజెక్ట్ మంజూరు చెయ్యడం శుభ పరిణామ మన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 2 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో జీవీఎంసీ19 వ వార్డు పరిధి లోని ఎంవిపి సెక్టర్ 11, సెక్టర్ 12, లాసన్స్



బే కాలని నంది గుడి ప్రాంతాల్లో నిర్మించనున్న తారు రోడ్లకి శంఖుస్థాపన చేశారు. వీటితో పాటుగా 17 వ వార్డు మద్ది వారి వీధిలో సంఘం బిల్డింగ్, ఆర్చ్ వద్ద భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ మరమ్మతుల కార్యక్ర మానికి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో 17 వ వార్డు టీడీపి అధ్యక్షుడు నెక్కంటి సత్తిబాబు, 17 వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు కాళ్ల శంకర్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ భైరెడ్డి పోతన రెడ్డి, చిన్నపిల్లి నరేంద్ర రెడ్డి, 20 వ వార్డు టీడీపి కార్యనిర్వహక అధ్యక్షుడు గొరుసు అప్పల రెడ్డి, టీడీపీ నాయకులు అలజంగి ఈశ్వరరావు, మతల రమణ, భద్రరావు, గొలగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** వీధి కుక్కలు పెరగకుండా చేపడుతున్న చర్యలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక 82 వార్డు, సుశీకరమెట్ట జంక్షన్ లో గల యానిమల్ బర్త్ సెంటర్(ఏబీసీ) లో కుక్కలకు చేస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కుక్కలను పట్టుకోవడం, స్టెరిలైజేషన్, వాటికి కల్పిస్తున్న వసతి, అందిస్తున్న ఆహారం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి, పశుసంవర్ధక శాఖ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడి తరలింపు పై మరోసారి అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

- కూటమి ప్రభుత్వం తాడి తరలింపు పై కట్టుబడి ఉంది.
- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.




**పరవాడ, పెన్ సత్తా, పిబ్రవరి 10:**తాడి గ్రామాన్ని తరలింపు చేయాలంటూ మంగళవారం తాడి అఖిలపక్ష నాయకులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును పెందుర్తి లోని క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన ఏ హామీని మర్చిపోలేదని, ఇందులో భాగంగా గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో తాడి తరలింపు ప్రస్తావన చేశానని, అదేవిధంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మొట్ట మొదటిసారి విశాఖపట్నం వచ్చిన సందర్భంగా అధికారులకు ఈ తాడి గ్రామ తరలింపు విషయం పై ఆదేశాలు కూడా ఇచ్చారని అన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను కలిసిన ప్రతిసారి ఫార్మా కాలుష్యంతో తాడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ, గ్రామ తరలింపు ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఉన్నానని, దీనికి ఆయన కూడా సానుకూలంగా ఉన్నారని అన్నారు. రేపటి నుంచి నెల రోజులు పాటు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో మరొక్కసారి తాడి తరలింపు విషయం ప్రస్తావించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపాయింట్మెంట్ తీసుకొని తాడి గ్రామస్తులను ఆయన వద్దకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. తప్పనిసరిగా తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడి గ్రామానికి సంబంధించిన అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జేసీగా సౌర్య మాన్ పటేల్.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10**: అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సౌర్య మాన్ పటేల్ ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2022 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన సౌర్య మాన్ పటేల్ 2021 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 281వ ర్యాంక్ సాధించారు. ఐఐటీ కాన్పూర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన గతంలో పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఈ పోస్టుకు తొలుత మల్లవరపు సూర్య తేజను నియమించినప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల ఆయన జాయిన్ కాలేదు. దీంతో సూర్య తేజను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు సేవలు ప్రశంసనీయం.

- సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు.
- డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన ఇద్దరికీ ఆత్మీయ సత్కారం.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, ప్రజలతో అనుసంధానం, మీడియాతో సమన్వయం వంటి అంశాలలో వారు సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వారిద్దరినీ ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి, దుశ్శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవలు అందించాలని, కొత్త బాధ్యతల్లోనూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ పనితీరును కనబరిచి అందరి ప్రశంసలూ అందుకోవాలన్నారు. శ్రీనివాసరావు పదోన్నతి పై అనకాపల్లి జిల్లాకు వెళ్తుండగా, వెంకటరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ పై వెళ్తున్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్, సీనియర్ అసిస్టెంట్ లావణ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.

- రీజనల్ ఐ, చెస్ట్ హాస్పిటల్లను సందర్శించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్.








**విశాఖపట్టణం, పెన్ సత్తా, ఫిబ్రవరి 10**: రోగులకు నాణ్య మైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ & ఛాతీ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాల పై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, శుభ్రత నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆధునిక వైద్య పరికరాల వినియోగం, ప్రయోజనాల గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి చికిత్స పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సునీల్ కుమార్, రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. మీనాక్షి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు ఇతర వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# 5 వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్లో ధర్మవరం చిన్నారుల ప్రతిభ



**ధర్మవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** ఆదివారం రోజున హైదరాబాదులో జరిగిన 5 వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్ లో ధర్మవరం చిన్నారుల ప్రతిభ కనబరిచారు. సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే టోర్నమెంట్ లో ధర్మవరం నుంచి ఏడు గురు పిల్లలు కరాటే మాస్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్నారు. వెళ్లిన చిన్నారులు అక్కడ జరిగిన కరాటే టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ మెడల్స్ సాధించిన చిన్నారులకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం రోజున సంత మార్కెట్ వద్ద ఉన్న గవర్నమెంట్ స్కూల్లో ఘనంగా సత్కరించారు. వీరిలో
పునీత్ గోల్డ్ మెడల్, కుశాల్, నమ్రత సాయి, సిల్వర్ మెడల్, వంశీకృష్ణ, వేదశ్రీ, ప్రణవి, శశాంక్, బ్రాంజ్ మెడల్స్ సాధించారాని తెలిపారు.

# పల్లెల రూపు రేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి.

- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతర చర్యలు.
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.







**కొత్తపేట, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** మండలంలో రూ.3 కోట్ల 57 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, రూ.1 కోటి 80 లక్షలతో వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి, మొత్తం రూ. 5 కోట్ల 37 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు. పల్లెల రూపు రేఖలు సమూలంగా మార్చడానికి, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతర చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. కొత్తపేట మండలం లోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల్లో ఆయన ఏపీ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారితో కల్సి పాల్గొన్నారు. కొత్తపేట మండలంలో వివిధ గ్రామాల్లో మొత్తం రూ.5 కోట్ల 37 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు శంకుస్థాపనలు నిర్వహించారు. ఇందులో రూ.3 కోట్ల 57 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు, రూ.1 కోట్ల 80 లక్షలతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. వాడపాలెంలో రూ.35 లక్షలతో ఆర్ అండ్ బి రహదారి, పలు సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో వాడపాలెం పెదపేట వద్ద ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.55 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కొత్తపేట శివారు బండారు పేటలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్, తదితర ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.42 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మందపల్లిలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

పలివెల గ్రామ పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.75 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంటి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి, రూ.36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఆవిడిలో రూ.50 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు.

బిల్లకుర్రులో రూ.70 ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రహదారి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వానపల్లిలో రూ.72 లక్షలతో నిర్మించనున్న 2 విలేజ్ హెల్త్ క్లినిక్ శంకుస్థాపన నిర్వహించారు.

ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయని, ఆరోగ్య సేవలు చేరువవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# భక్తులతో మమేక మైన టీటీడీ చైర్మన్



- టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాల పై అభిప్రాయాలు సేకరణ.
- శ్రీవారి సేవకులతో కలిసి అన్న ప్రసాదాలను వడ్డించిన చైర్మన్.
- సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపిన భక్తులు.

**తిరుమల, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులతో మమేక మై టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాల పై స్వయంగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం ఆయన తిరుమల లోని సుదర్శన్ సత్రాన్ని తనిఖీ చేసి గదుల్లో వాటర్ లీకేజీని అరికట్టాలని ఆదేశించారు. ఈ భవనాన్ని ఆధునీకరణ లేదా పునర్నిర్మాణం చేసే విధంగా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

ఈ సందర్భంగా సుదర్శన్ సత్రం వద్ద ఉన్న ఫుడ్ కౌంటర్ లో శ్రీవారి సేవకులతో కలిసి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. అన్న ప్రసాదాల రుచి, నాణ్యత గురించి ఏవిధంగా ఉందని అడగ్గా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి పక్కనే ఉన్న టీ దుకాణంలో టీ సేవించారు. అంతకు ముందు చైర్మన్ తిరుమల లోని కాకులమానుతిప్ప వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఐఓసీఎల్ గ్యాస్ ప్లాంటును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 నెలల ముందు తిరుమలలో ఐఓసీఎల్ ప్లాంటుకు శంకుస్థాపన చేశామని చెప్పారు. మార్చి నెలలో నిర్మాణం పూర్తి చేసి మే నెల నుండి ఈ ప్లాంటు ద్వారా కార్యాకలాపాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ప్లాంటును రోజుకు 40 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా టీటీడీకి సంవత్సరానికి 1.52 కోట్లు ఆదా అవుతుందని, అంతే కాకుండా చెత్తను పునర్ వి యోగించడంతో తిరుమల డంపింగ్ యార్డులో చెత్త పేరుకు పోకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, భాస్కర్, వీజీవో సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పదవతరగతి, ఇంటర్మీడియెట్ లలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి.

- 100 రోజుల ప్రణాళిక ఖచ్చితంగా అమలుచేయాలి.
- డి-గ్రేడ్ విద్యార్థులకు 30 రోజుల ప్రత్యేక ప్రణాళిక.
- విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేకశద్ద వహించాలి.
- పరీక్షల వత్తిడి గురికాకుండా కౌన్సిలింగు అందివ్వాలి.జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** పదవతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి వసతి గృహాల అధికారులు, సంక్షేమ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, విద్యార్థుల పరీక్షల సన్నద్ధత పై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ రానున్న 30 రోజులు ఈ విద్యా సంవత్సరంలో చాలా కీలకమని, విద్యార్థులు శతశాతం ఉత్తర్ణత సాధించుటకు రూపొందించిన వంద రోజుల ప్రణాళికను విజయవంతంగా అమలుచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఎక్కువ ఎ-గ్రేడ్ లు సాధించేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా డి-గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన 30 రోజుల ప్రత్యేక ప్రణాళిక ద్వారా వారిని చదివించి ఉత్తీర్ణులయ్యేలా కృషిచేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన సుమారు 300 రెగ్యులర్ విద్యార్థిని, విద్యార్థులను దగ్గరలో గల వసతిగృహలకు పంపించడం జరిగిందని, వారి పై ప్రత్యేక శ్రద్ధవహించి చదివించాలని ఆదేశించారు. వసతిగృహాలలో ఉదయం, సాయంత్రం పఠనా సమయాలను తప్పకుండా నిర్వహించాలని, ప్రతి ఆదివారం సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు ప్రత్యేక సబ్జెక్టు ఉపాధ్యాయులతో నిర్వహించే డయల్ యువర్ సబ్జెక్ట్ టీచరు కార్యక్రమాన్ని వినియోగించు కొని విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పాఠశాలల దత్తత అధికారులు ప్రతిరోజు తప్పనిసరిగా వారికి కేటాయించిన పాఠశాలను సందర్శించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. విద్యార్థులు పరీక్షల వత్తిడికి గురికాకుండా వారికి కౌన్సిలింగు అందిచాలని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. వసతి గృహాల నిర్వహణ గూర్చి మాట్లాడుతూ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శద్ధవహించాలని ఆదేశించారు. నాణ్య మైన ఆహారం, శుభ్ర మైన మంచినీరు అందించాలని, పారిశుద్యం పాటించాలని తెలిపారు. ఏపూట వండిన ఆహార పదార్ధాలను ఆపూటమాత్రమే వండి, వడ్డించాలని, ఎక్కడైనా ఫుడ్ పాయిజను సంఘటనలు జరిగితే సంబంధిత వసతిగృహ అధికారులే బాద్యులని, వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు, సాంఘిక సంక్షేమ అధికారి వరబాబు , వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి శ్రీదేవి, వసతి గృహాల అధికారులు, సంక్షేమ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

# అదనపు ఆర్టీసీ బస్సుల కోసం సిపిఎం ధర్నా

**గీతం కాలేజీకి కేటాయించిన బస్సులు రద్దు చేయాలని జగ్గునాయుడు డిమాండ్.**




**విశాఖపట్నం, పెన్ సత్తా, పిబ్రవరి 10:** ప్రజల రవాణా అవసరాలకు తగినట్లు ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేసారు. పెరుగుతున్న జనాభాకు తగినట్లు ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకపోవడంతో పేద, సాధారణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విశాఖ జిల్లా జనాభాకు తగినట్లు 1,760 అదనపు నూతన బస్సులను ఏర్పాటు చేయాలని మంగళవారం విశాఖ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కి వినతిపత్రం సమర్పించారు. రీజనల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో జగ్గునాయుడు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అవసరాలకు తగినట్లు బస్సులు పెంచకపోవడంతో వ్యయప్రయాసలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. 30 లక్షలు జనాభా కలిగిన విశాఖ జిల్లాలో సగటున వెయ్యిమందికి ఒక ఆర్టీసి బస్సు ఉండాలనే నిబంధన ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. ప్రయాణీకుల అవసరాలను పరిగణన లోకి తీసుకొని ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. ఒకవైపు సాధారణ ప్రయాణీకులకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపకపోగా, ఉన్న కొద్దిపాటి బస్సులో గీతం లాంటి కాలేజీలకు కేటాయించడం సరికాదన్నారు. ఆర్టీసి యాజమాన్యం తక్షణమే విశాఖపట్నం ఎంపి శ్రీ భరత్ చెందిన గీతం కాలేజీతో సహా ప్రైవేటు సంస్థలు, కాలేజీలకు కేటాయించే బస్సులను రద్దు చేసి ప్రయాణీకులకు వాటిని ఉపయోగించాలని కోరారు. బస్సు లేని ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని, నిలిపివేసిన ప్రాంతాలకు బస్సులను పునరుద్ధరించి ఆర్టీసీ సేవలు విస్తరించాలన్నారు. ఆర్టీసీలో శాశ్వత ప్రతిపాదికన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని నియమించి ఉద్యోగుల పై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. బస్సులు సరిపడ లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. పద్మ, ఆరెకెఎస్వి కుమార్, పి.మణి, వి. క్రిష్ణారావు, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి. ఈశ్వరమ్మ, యు.ఎస్.ఎన్. రాజు, బి.రమణి, పి. పైడిరాజు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# జల జీవన్ మిషన్ పనులు వేగవంతం



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని ఉపమాక సర్పంచ్ వీరబాబు నక్కపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మంగళవారం ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ శివప్రసాద్ తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామములో జరుగుతున్నటు వంటి జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసి సకాలంలో ప్రజలకు త్రాగునీరు అందించేలా చూడాలని హోంమంత్రి అనిత ఆదేశించారని అన్నారు. ఉపమాక గ్రామ పంచాయతీ లో త్రాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

# ఎస్ ఆర్ ఆర్ పరిశ్రమ నిధులతో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** నక్కపల్లి మండలం మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో ఎస్ ఆర్ ఆర్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కుప్పిశెట్టి వెంకటేష్ రిబ్బన్ కట్ చేసి గ్రౌండ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి అనిత ఆదేశాలు మేరకు ఎస్ ఆర్ ఆర్ ప్రైవేట్ పరిశ్రమ నిధులతో క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు,మాజీ జడ్పీటీసీ కురందాసు నూకరాజు, పిఎసిఎస్ చైర్పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, జిల్లా మత్స్యశాఖ సంఘ అధ్యక్షులు గోసల పెదతాతారావు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, రాజయ్యపేట ఎంపీటీసీ సత్తియ్య, పార్టీ ప్రెసిడెంట్ గంగరాజు, పీక్కి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గుల్లిపాడు లో ఘనంగా గూడుపమ్మ తల్లి పండగ



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10 :** నక్కపల్లి మండలం గుల్లిపాడు గ్రామం ఇలవేల్పు గూడుపమ్మ తల్లి పండగ మంగళవారం సందడిగా జరిగింది. అమ్మవారి పండగ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలో భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. గూడుపమ్మ అమ్మవారిని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పొడకట్ల పాపారావు, అయినంపూడి మణిరాజు, గొర్ల గోవిందు స్థానిక నాయకులు తో పాటు పలు రాజకీయ పార్టీల ప్రముఖులు దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భజన కార్యక్రమాలు, భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వహకులు తెలిపారు.



## జి.ఎస్.ఆర్ చౌదరి కి సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు

**గుంటూరు, పెన్ సత్తా, పిబ్రవరి 10:** విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్ ఉద్యోగి, ప్రముఖ ఫిలిం జర్నలిస్ట్, హీరో కృష్ణ కు వీరాభిమాని గుమ్మడి సీతారామయ్య చౌదరికి ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డును అందజేసారు. మంగళవారం గుంటూరు కన్నవారితోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎఫ్.టి.పి.సి సంస్థ ప్రధాన కార్యదర్శి సినీ నిర్మాత పాకలపాటి విజయవర్మ, సంయుక్త కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, సినీగీత రచయిత తైదల బాబు లు జి.ఎస్.ఆర్ చౌదరికి ఈ పురస్కారాన్ని అందజేసారు. ఈ సందర్భంగా జి.ఎస్.ఆర్ చౌదరి ని ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా విజయ్ వర్మ మాట్లాడుతూ కృష్ణ అభిమానిగా సీతారామయ్య చౌదరి చేసిన సేవలను ప్రస్తుతించారు. సినీ అభిమానులకు సీతారామయ్య స్ఫూర్తిదాయకం అన్నారు. సినీ గేయ రచయిత తైదల బాబు మాట్లాడుతూ కృష్ణ జీవిత చరిత్రను సంపూర్ణంగా సేకరించిన ఘనత సీతారామయ్య దే అన్నారు. అవార్డు గ్రహీత జి.ఎస్.ఆర్.చౌదరి మాట్లాడుతూ లక్షలాది కృష్ణ అభిమానులలో తనను గుర్తించి, సూపర్ స్టార్ అవార్డుకు ఎంపిక చేసిన ఎఫ్.టి.పి.సి అధ్యక్షులు చైతన్య



జంగా, కార్యదర్శి విజయ వర్మ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరదేశీమాంబ పండుగ సందర్బంగా అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ





**పరవాడ, పెన్ సత్తా, పిబ్రవరి 10:** గ్రామంలో పరదేశీమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ సందర్భంగా పరవాడ మండల ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పండుగ మహోత్సవ సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమరాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయం కి విచ్చేసిన సందర్భంగా పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, చల్ల కనకరవు, మాజీ సర్పంచ్ పయిల అప్పారావు, పయిల రామ చంద్రరావు, మండల ప్రధాన కార్యదర్శి పయిల రాధ కృష్ణ, పయిల అప్పల నాయుడు, వై.సి.పి నాయకులు వర్రీ హరి, పయిల సురేష్, పయిల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యం ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** జిల్లాలో రహదారి ప్రమాదాలను అరికట్టి, ప్రయాణికుల భద్రతను మెరుగు పరచడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు రంగం లోకి దిగి అవగాహన కార్యక్రమాలు, కఠిన మైన ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి, నక్కపల్లిలో ముమ్మర తనిఖీలు.

అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ, నక్కపల్లి ఇన్స్పెక్టర్ మురళి నేతృత్వంలో ఎస్సైలు, హైవే మొబైల్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం

అనకాపల్లి మార్కెట్ ప్రాంతం, డీసీఎంస్ సైట్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన సదస్సు నిర్వహించారు. నిబంధనలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

అత్యధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నక్కపల్లి జంక్షన్ వద్ద రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారు, హెల్మెట్ ధరించని వారి పై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడంతో పాటు, కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రమాదకర మైన మెడియన్ కటింగ్స్ మూసివేత, జాతీయ రహదారి 16 పై ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. నక్కపల్లి మండలం ఒడ్డుమిట్ట గ్రామం వద్ద జాతీయ రహదారి పై అనధికారికంగా ఏర్పాటు చేసిన మెడియన్ కటింగ్‌ను నిన్న గుర్తించిన పోలీసులు, దానిని వెంటనే మూసివేయించారు. ఇటువంటి అడ్డదారి మలుపుల వల్ల జరిగే ఘోర ప్రమాదాలను నివారించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పోలీసుల హెచ్చరిక వాహనదారులు ముఖ్యంగా ఈ క్రింది నిబంధనలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ రాంగ్ రూట్లో ప్రయాణించకూడదు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. జాతీయ రహదారుల పై అనధికారికంగా డివైడర్లను కట్ చేయడం చట్టరీత్యా నేరం. ప్రజల ప్రాణ రక్షణే మా ప్రాధాన్యత. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి అని కోరారు.

## ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై అమెజాన్‌లో ఆఫర్లు



ప్రేమికుల రోజు సమీపిస్తున్న వేళ, తమకు ఇష్టమైన వారికి ఎలాంటి బహుమతి ఇవ్వాలా అని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఖరీదైన బహుమతులు ఇవ్వాలనే నియమమేమీ లేకపోయినా, కొత్త ఫోన్ కొనాలని ప్లాన్ చేస్తున్న వారికి మాత్రం ఇది సరైన సమయం. ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్‌లో ఎంతో క్రేజ్ ఉన్న ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై అమెజాన్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆఫర్లను సరిగ్గా వినియోగించుకుంటే వేల రూపాయలు ఆదా చేసుకోవచ్చు.ప్రస్తుతం అమెజాన్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 256ఉః మోడల్ ధర సుమారు రూ. 1,49,900గా ఉంది. ఇది ప్రీమియం ఫోన్‌కు ఉండే సాధారణ ధరే అయినప్పటికీ, కొన్ని ఆఫర్లతో దీనిని తక్కువ ధరకు సొంతం చేసుకోవచ్చు.ప్రైమ్ మెంబర్లు అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉపయోగించి కొనుగోలు చేస్తే, సుమారు రూ. 7,495 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. అయితే ఇది తక్షణ తగ్గింపు కాదు. ఈ మొత్తం అమెజాన్ పే బ్యాలెన్స్‌లో జమ అవుతుంది.ఈ ప్రయోజనం కార్డు వినియోగదారులను బట్టి మారుతుంది, చెక్‌అవుట్ సమయంలో తుది మొత్తం తెలుస్తుంది.దీంతో పాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా అందుబాటులో ఉంది. పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ. 48,000 వరకు తగ్గింపు పొందవచ్చు. ఉదాహరణకు, మంచి కండిషన్‌లో ఉన్న ఐఫోన్ 15 మోడల్‌కు సుమారు రూ. 32,150 వరకు ఎక్స్ఛేంజ్ విలువ లభించే అవకాశం ఉంది.బ్యాంక్ క్యాష్‌బ్యాక్, ఎక్స్ఛేంజ్ విలువ, ఇతర చిన్న బోనస్‌లు అన్నీ కలిపితే కొనుగోలుదారులు సుమారు రూ. 39,645 వరకు ప్రయోజనం పొందవచ్చు. అయితే, పాత ఫోన్ కండిషన్‌ను బట్టి ఎక్స్ఛేంజ్ విలువ మారుతుందని గమనించాలి. డెలివరీ సమయంలో పాత ఫోన్‌ను పరిశీలించిన తర్వాతే తుది ఎక్స్ఛేంజ్ విలువను నిర్ధారిస్తారు. మొత్తం మీద, వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రీమియం ఫోన్ కొనాలనుకునే వారికి ఇది ఒక మంచి అవకాశమనే చెప్పాలి.

## ఎయిర్‌లైన్ కంపెనీల నష్టాలు రూ. 5,290 కోట్లు



గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమానయాన సంస్థలు మొత్తం రూ. 5,289.73 కోట్ల నష్టాలను నమోదు చేశాయని ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో ఎయిర్ఇండియా గ్రూప్ మాత్రమే రూ.9,808.12 కోట్ల నష్టాలను చూసిందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. దేశంలోని మొత్తం 11 ఆపరేటర్లలో, ఇండిగో, బ్లూ డార్ట్, స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్ సంస్థలు మాత్రమే లాభాలను చూశాయి. పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ సోమవారం రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో దీనికి సంబంధించిన డేటాను అందించారు. దీని ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వరుసగా రూ.3,975.75 కోట్లు, రూ. 5,832.37 కోట్ల నష్టాన్ని నమోదు చేయగా, అకాసా ఎయిర్ రూ. 1,986.25 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన అలయన్స్ ఎయిర్ రూ.691.12 కోట్లు నష్టపోగా, స్పైస్‌జెట్ నష్టం రూ. 55.67 కోట్లుగా ఉంది. ఇతర ఎయిర్‌లైన్స్‌లో ఫ్లై91 (రూ. 67.65 కోట్లు), క్విక్‌జెట్ కార్గో (రూ. 1.34 కోట్లు) నష్టపోయాయి. అయితే, ఇండిగో రూ. 7,253.30 కోట్ల లాభాన్ని ఆర్జించగా, ఇతర సంస్థలు స్టార్ ఎయిర్ (రూ. 68.75 కోట్లు), బ్లూ డార్ట్ (రూ. 0.71 కోట్లు), ఇండియావన్ ఎయిర్ (రూ. 0.33 కోట్లు) లాభాలు చూశాయి.

## మళ్లీ పెరుగుతున్న వెండి, బంగారం ధరలు



బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికన్ డాలర్ బలహీనపడటంతో సోమవారం రాత్రి 10.30 గంటలకు బులియన్ మార్కెట్లో వెండి ధరలు 6 శాతానికి పైగా పెరిగి కిలో రూ.2.72 లక్షలకు చేరుకున్నాయి, బంగారం ధర దాదాపు 1 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1.58 లక్షలకు చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో వెండి ధర కిలో రూ. 15 వేలు పెరిగి రూ.3,00,000కి చేరుకుంది. స్వచ్ఛమైన బంగారం పది గ్రాముల ధర రూ. 1,310 పెరిగి రూ. 1,58,500కి చేరింది.ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,200 పెరిగి రూ. 1,44,750కి పెరిగింది. అమెరికన్ డాలర్ బలహీనపడటం, తక్కువ ధరకు కొనుగోళ్లు జరగడం వల్ల సోమవారం బంగారం ధరలు పెరిగాయి. డాలర్ ఇండెక్స్ దాదాపు 0.30 శాతం తగ్గి 97 స్థాయి వద్ద ట్రేడ్ అవుతోంది. దీనివల్ల బులియన్ ధరలను ప్రభావితం చేశాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ అన్నారు. గ్లోబల్ మార్కెట్లలోనూ ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ వెండి ధర 2.81 శాతం పెరిగి ఔన్సు 80.21 డాలర్లకు చేరుకోగా, బంగారం ధర 1 శాతం పెరిగి ఔన్సుకు 5,012.94 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా జనవరిలో వరుసగా 15వ నెల కూడా బంగారం కొనుగోళ్ల పరంపరను కొనసాగించినట్టు డేటా వెలువడటంతో విలువైన లోహాలపై పెట్టుబడిదారుల సెంటిమెంట్ మరింత పెరిగిందని గాంధీ పేర్కొన్నారు.

# మరింత చౌకగా కార్ లోన్

ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా కారు కొనాలనుకునే వారికి భారీ గుడ్‌న్యూస్ ప్రకటించింది. కార్ లోన్ వడ్డీ రేట్లను 30 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. తగ్గించిన రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఈ నిర్ణయంతో తన ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఇప్పుడు సంవత్సరానికి 7.6 శాతం నుంచి ప్రారంభమవుతుందని బీఓబీ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో బరోడా కార్ లోన్‌లపై ఏడాదికి 8.5 శాతం నుంచి స్థిర వడ్డీ రేటును అమలు చేయనున్నట్టు వివరించింది. 7.6 శాతం నుంచి ప్రారంభమయ్యే కొత్త రేటు కొత్త కారు కొనుగోలు సమయంలోనే అందుబాటులో ఉంటుందని, ఇది కూడా రుణగ్రహీత క్రెడిట్ ప్రొఫైల్‌పై ఆధారపడి ఉంటుందని బ్యాంక్ స్పష్టం చేసింది. తక్కువ వడ్డీ రేటును అందించడంతో పాటు, బ్యాంక్ కస్టమర్‌లకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండానే తమ కార్ లోన్‌ను ముందుగానే క్లియర్ చేయడానికి కూడా అవకాశం కల్పిస్తోంది. అయితే ఇది కేవలం ఫ్లోటింగ్ రేట్ లోన్‌లకు మాత్రమే వర్తిస్తుంది. మరింత సులభంగా చెప్పాలంటే,



కార్ లోన్ తీసుకున్నవారు గడువు పూర్తవక ముందే లోన్‌ను ముగించవచ్చు. దీనికి బ్యాంక్ ఎలాంటి జరిమానా విధించదు. ఉదాహరణకు, ఐదేళ్ల కాలానికి కార్ లోన్ తీసుకున్నావారు, రెండేళ్ల తర్వాత, బోనస్ లేదా అదనపు సొమ్ము అందినప్పుడు లోన్ క్లియర్ చేయవచ్చు. దీనిపై బ్యాంక్ ఎలాంటి అదనపు ఛార్జీలు విధించదని పేర్కొంది.

# 1,00,000 మార్కు చేరనున్న సెన్సెక్స్



భారతీయ ఈక్విటీ మార్కెట్లు క్రమంగా లాభాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ స్టాక్ మార్కెట్ రీ-రేటింగ్‌కు సిద్ధంగా ఉందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. ఈ క్రమంలో ఏడాది ఆఖరు నాటికి కీలక బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 1,00,000 మార్కును చేరుకుంటుందని అంచనా వేసింది. కొవిడ్-19 మహమ్మారి తర్వాత దేశీయంగా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఫలితంగా స్టాక్ ధరలు పుంజుకునేందుకు అవసరమైన సానుకూల వాతావరణం మార్కెట్లలో కనిపిస్తోంది. ఆర్థిక వృద్ధిని పెంచడానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నాయి. వీటిలో వడ్డీ రేట్లను తగ్గించడం, బ్యాంకులు రుణాల జారీ సులభతరం చేయడం, వ్యవస్థలోకి మరింత నగదును చేర్చడం, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం కేటాయింపులు పెంచడం, పన్ను సంస్కరణలు వంటివి ఉన్నాయి. ఈ చర్యలన్నీ కంపెనీలు వేగంగా వృద్ధి చెందడానికి, ఎక్కువ లాభాలను ఆర్జించడానికి సహాయపడతాయి. తద్వారా స్టాక్ ధరలు పెరుగుతున్నాయి. ఇదే సమయంలో ఇతర మార్కెట్లతో పోలిస్తే భారత ఈక్విటీ మార్కెట్లు చౌకగా ఉండటం, ఇటీవల ర్యాలీ చేస్తుండటం, తాజాగా కొత్త గరిష్టాలకు చేరుతుండటం వల్ల భారతీయ స్టాక్‌లు ప్రస్తుతం ఆకర్షణీయంగా ఉన్నాయని మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. ఇవన్నీ మార్కెట్‌కు మద్దతు ఇస్తాయి. మెరుగుపడుతున్న వాణిజ్య సంబంధాలు, చైనాతో ఉద్రిక్తతలను తగ్గించడం కూడా స్టాక్ మార్కెట్లకు సానుకూల సంకేతాలుగా మారుతున్నాయి. వీటన్నిటి వల్ల ఈ ఏడాది డిసెంబర్ నాటికి సెన్సెక్స్ దాదాపు 95,000కి చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది.

# అరబిందో ఫార్మా లాభం రూ.910 కోట్లు

ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 2025-26 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 7.6 శాతం వృద్ధితో రూ.910.29 కోట్లకు చేరింది. 2024-25 మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.845.81 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.7,978.52 కోట్ల నుంచి 8.4 శాతం వృద్ధితో రూ.8,646 కోట్లకు చేరింది. ఐరోపా మార్కెట్, యాంటీ రెట్రోవైరల్ విభాగాల్లో విక్రయాలు ఈ వృద్ధికి దోహదం చేశాయి. అమెరికా మార్కెట్‌లో రూ.3,729 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 9 ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. ఐరోపా ఆదాయం 27.4 శాతం పెరిగి, రూ.2,703 కోట్లకు చేరింది. ఏపీఐ వ్యాపారం 4.3 శాతం క్షీణించి, రూ.963 కోట్లకు పరిమితమైంది. విద్యుత్ ఖర్చుల ఆదాలో భాగంగా గరుడ రెన్యూవబుల్స్‌లో రూ.66 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా తన అనుబంధ సంస్థ ఆరో వ్యాక్సిన్స్‌ను మరో అనుబంధ సంస్థ క్యూరేటెక్ బయోలాజిక్స్‌తో విలీనం చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా పునీతా కుమార్ సిన్హాను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 'మా ప్రధాన మార్కెట్లైన అమెరికా, ఐరోపాలలో గిరాకీ నిలకడగా ఉంది. దీంతో ఈ త్రైమాసికంలో స్థిరమైన పనితీరు కనిపించింది.




# పీఎఫ్ ఉపసంహరణ కోసం.. కొత్త ఈపీఎఫ్ఓ యాప్




ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులు, తమ ఈపీఎఫ్‌లో ఉన్న సొమ్మును యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఉపసంహరించుకునే సదుపాయం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుంది. ఇందుకోసం సరికొత్త ఈపీఎఫ్ఓ మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈపీఎఫ్‌లో కొంత భాగం మినహా మెజారిటీ వాటాను చందాదారులు తమ బ్యాంకు ఖాతాలోకి యూపీఐ

ద్వారా ఉపసంహరించుకునే సౌలభ్యాన్ని తీసుకొచ్చే ప్రాజెక్టుపై కార్మిక శాఖ పనిచేస్తుంది. ఈపీఎఫ్ఓ సరికొత్త మొబైల్ యాప్‌ను తీసుకురానుందని, ఇందులో సభ్యులు యూపీఐ ద్వారా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని, పాస్‌బుక్ బ్యాలెన్స్ వంటి ఇతర సేవలను కూడా పొందొచ్చని వెల్లడించాయి. కొత్త మొబైల్ యాప్‌లో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసేందుకు ఎంత ఈపీఎఫ్ మొత్తం అందుబాటులో ఉంది అనే వివరాలను చందాదారులు తెలుసుకోవచ్చు. చందాదారులు లావాదేవీలను పూర్తి చేయడానికి, వారి బ్యాంక్ ఖాతాలకు నిధులు భద్రంగా వెళ్లడానికి లింక్ చేసిన యూపీఐ పిన్‌ను వినియోగించాలి. సేవలను మెరుగుపరచడానికి, సాంకేతిక లోపాలను తొలగించడానికి ప్రస్తుతం 100 డమ్మీ ఖాతాలతో ఈపీఎఫ్ఓ ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ యాప్‌ను తీసుకొచ్చేందుకు కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది.

# క్యూబాకు రెండు నౌకలు మానవతాసాయాన్ని పంపిన మెక్సికో

క్యూబాకు మానవతాసహాయంతో రెండు నౌకలను పంపినట్లు మెక్సికో విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరిస్‌లను అమెరికా కిడ్నాప్ చేసిన అనంతరం వెనిజులా నుండి చమురు సరఫరా నిలిచిపోవడంతో క్యూబా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. 814 టన్నుల సహాయం పంపిణీ చేసినట్లు ఆదేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. క్యూబాకు సామగ్రిని తీసుకువెళుతున్న రెండు నావికాదళ నౌకలు ఆదివారం బయలుదేరాయని, నాలుగురోజుల్లో క్యూబాకు చేరుకుంటాయని పేర్కొంది. తాజా పాలపొడి, మాంసం, బియ్యం, బీన్స్, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిపింది. మరో 1500టన్నుల ఆహారపదార్థాలు పంపిణీ చేసేందుకు వేచి ఉన్నాయని పేర్కొంది. అయితే క్యూబాకు చమురు రవాణా చేసే ఏ దేశంపైనైనా సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో క్యూబాకు చమురును పంపిణీ చేసే మార్గం కోసం మెక్సికో అన్వేషిస్తోంది. గతేడాది, మెక్సికో సుమారు 500 మిలియన్ డాలర్ల విలువైన చమురు మరియు పెట్రోలియం ఉత్పత్తులను క్యూబాకు రవాణా చేసినట్లు ప్రభుత్వరంగ సంస్థ పెమెక్స్ గతవారం ది

తెలిపింది. క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని రష్యా తీవ్రంగా ఖండించింది. విమానాలు, రవాణాకు అవసరమైన ఇంధన సరఫరాపై ఆంక్షలు విధించడంతో క్యూబాలో పరిస్థితి క్లిష్టంగా మారిందని రష్యా అధ్యక్ష ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ సోమవారం పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలను కఠినతరం చేయడం పరిస్థితి మరింత దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎడిటోరియల్

## సాంకేతికత రంగంలో 'ఆమె'ను పాత్ర ఎక్కడా!

నేటి అత్యాధునిక డిజిటల్–ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్తపుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చి వేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్–టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు/బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగవలసిన ప్రగతి నమోదు కావడంలేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్–టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఈ మధ్య కాలంలో సైన్స్ చదివే బాలికలు, యువతుల సంఖ్య కొంత వరకు పెరిగినా సాధించాల్సింది చాలా ఉందని గమనిస్తూ వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడం అవసరం అని తెలుసుకోవాలి. ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి బాలికలు/యువతులను సైన్స్ వైపు ఆకర్శించడానికి ఐరాస–యూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని" పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు, తల్లితండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు/యువతుల దృష్టిని "స్టెమ్– ఎస్‌టిఈఎం"– సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. నేడు 33 శాస్త్రం మహిళా శాస్త్రజ్ఞులు, 35 శాతం బాలికలు/యువతులు స్టెమ్ రంగంలో కొనసాగుతున్నారని, దీనిని 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పురుషాధిక్య సమాజం బేషరతుగా ఒప్పుకోవాలి. సైన్స్–టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం" నిర్వహిస్తున్నారు. 2026 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా "సైన్స్–టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి "ప్రణాళికలు ప్రభావం చూపడం : స్టెమ్ విద్యలో లింగ అసమానతల తగ్గింపు" అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. 1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి. నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్–టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం. సైన్స్–టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్‌షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం. సైన్స్–టెక్నాలజీ రంగాల్లో 'ఆమె' మేధో సంపత్తిని పెట్టుబడిగా పెడదాం.

## ఒక్క లవంగం తిన్నా చాలు బోలెడు లాభాలు



లవంగాలలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు వంటలకు మంచి రుచి, సువాసనను ఇస్తాయి. కానీ వాటి వినియోగంపై అపోహలున్నాయి. నిజానికి, తగిన మోతాదులో వాడితే పొట్ట, అన్నవాహిక అల్సర్‌లను నివారించడంలో అద్భుతంగా సహాయపడతాయి. అయితే, మోతాదు మించితే మంట, ఇతర సమస్యలు రావచ్చని 2014 పరిశోధనలు తెలుపుతున్నాయి. లవంగాలలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు మాంగనీస్, విటమిన్ ఐ, విటమిన్ అ, ఫైబర్‌తో కూడిన అత్యంత పోషకమైన సుగంధ ద్రవ్యాలుగా పరిగణిస్తారు. దీనిలోని యూజెనాల్ అనే యాంటీఆక్సిడెంట్ ఎన్నో సమస్యలను దూరం చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. వంటకాలకు సువాసన, రుచిని అందించే లవంగాలు మన దైనందిన ఆహారంలో ఒక భాగం.. అయితే, లవంగాలు ఎక్కువైతే పొట్టలో మంట, అసౌకర్యం, అల్సర్‌లు వంటి సమస్యలు వస్తాయని చాలామంది భయపడుతుంటారు. ఇది కొంతమందిలో వేడి చేసిన అనుభూతిని కూడా కలిగిస్తుంది. అయితే, లవంగాలపై జరిగిన శాస్త్రీయ పరిశోధనలు ఈ అపోహను పాక్షికంగా తొలగిస్తూ ఒక కీలకమైన వాస్తవాన్ని వెల్లడించాయి. లవంగాలు సరైన మోతాదులో ఉపయోగించినప్పుడు, అవి పొట్టలో, అన్నవాహికలో (ఆహార నాళం) అల్సర్‌లు ఏర్పడకుండా అద్భుతంగా రక్షించగలవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.లవంగాలలో ఉండే ప్రత్యేకమైన ఘాటుకు కారణమైన రసాయన సమ్మేళనాలు.. మనం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థలోని జిగురు పొరలను (ఎబీఇనీబీబ ఎవఎెతీజీనివబ) ఉత్తేజపరుస్తాయి. ఈ ప్రేరణ వల్ల జిగురును ఉత్పత్తి చేసే కణజాలం క్రియాశీలమై, కడుపు, అన్నవాహిక గోడలపై రక్షణ కవచంలా పనిచేసే జిగురు ఎక్కువగా స్రవించేలా చేస్తుంది. ఈ జిగురు పెరగడం వల్ల కడుపులో మంటలు, అల్సర్‌లు వంటివి రాకుండా అడ్డుకుంటుంది. ఎర్ర కారం వంటి వాటి ఘాటుకు ఇలాంటి రక్షణ యంత్రాంగం ఉండదు.. కానీ లవంగాల ఘాటుకు ఈ విశిష్ట ప్రయోజనం ఉంది. అయితే, ఈ ప్రయోజనం మోతాదుకు లోబడి ఉంటుంది. మూడు లేదా నాలుగు లవంగాలను మించి వాడకుండా ఉంటేనే పొట్టలో, అన్నవాహికలో అల్సర్‌ల నుండి రక్షణ లభిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ మోతాదుకు మించి, అనగా నాలుగైదు లవంగాల కంటే ఎక్కువ వాడినప్పుడు, లవంగాలలో ఉండే రసాయన ప్రభావం అధికమై రివర్స్ సైడ్ ఎఫెక్ట్‌లకు దారితీస్తుంది. ఈ అధిక ప్రభావం వల్ల మంట, ఇరిటేషన్ ఎక్కువైపోయి అసౌకర్యం కలుగుతుంది. ఈ పరిశోధనల వివరాలను 2014వ సంవత్సరంలో బ్రెజిల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సావోపాలో అందించింది. అందుకనే, లవంగాలు రోజూ వాడితే మంటలు, అల్సర్‌లు వస్తాయనే అపోహ ఉన్నప్పటికీ, సరైన మోతాదులో ఉపయోగించడం

వల్ల అనేక లాభాలు పొందవచ్చు. చాలామంది వెజిటేరియన్ వంటకాల్లో లవంగాలు లేకుండా మసాలాలు వాడతారు.. అయితే ప్రత్యేక వంటకాల్లో, ముఖ్యంగా నాన్–వెజ్ వంటకాల్లో గుమగుమలాడే రుచి కోసం లవంగాలు వాడుతుంటారు. కానీ, తగు రీతిలో వాడుకున్నప్పుడు మాత్రమే లవంగాల వల్ల కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే మోతాదుకు మించకుండా లవంగాలను వాడకూడదు..

## ఎవ్వరికీ తెలియని అద్భుతమైన ఔషధ రహస్యం



మెంతులు మన వంటింటి దినుసులలో దాగున్న అద్భుత ఔషధం. ఇవి ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి, తల్లిపాలు పెంచడానికి, ప్రసవాన్ని సులభతరం చేయడానికి ఉపకరిస్తాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం నియంత్రణకు, మలబద్ధకం, జ్వరం, గొంతునొప్పి నుండి ఉపశమనం పొందడానికి మెంతులు ఎంతగానో సహాయపడతాయి. రోజువారీ ఆహారంలో మెంతులను చేర్చుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మన వంటింట్లో ప్రతిరోజు వాడే దినుసులలో మెంతులు ఒకటి.. కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, మెంతులు అద్భుతమైన ఔషధ గుణాలతో నిండి ఉన్నాయని చాలామందికి తెలియదు. ఆరోగ్యానికి, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. నిత్యం వీటిని సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. ఉదయాన్నే పరగడుపున మెంతుల నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. మెంతుల నీరు.. ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, ప్రోటీన్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలతో కూడిన శక్తివంతమైన పానీయం. రాత్రి నానబెట్టిన మెంతుల నీటిని ఉదయం పరగడుపున తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.. బరువు తగ్గుదలకు సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు.మెంతులు, మెంతుల నీరు బాలింతలలో తల్లిపాలు పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. మెంతికూరను ఆహారంలో చేర్చడం లేదా మెంతులతో చేసిన దోసెలు, ఇడ్లీలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుంది.గర్భధారణ సమయంలో, ప్రసవాన్ని సులభతరం చేయడానికి, గర్భాశయ సంబంధ సమస్యలను తగ్గించడానికి మెంతులు ఉపయోగపడతాయి. ప్రసవం తర్వాత పేగుల కదలికను మెరుగుపరచి, నడుము నొప్పి వంటి సమస్యలను నివారిస్తాయి.అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు రోజుకు 10–20 గ్రాముల మెంతులను నీటిలో లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.మధుమేహం నియంత్రణకు మెంతులు, మెంతుల నీరు అద్భుత ఔషధం. ప్రతిరోజూ ఒక టీస్పూన్ మెంతి పొడిని మూడు సార్లు తీసుకోవడం లేదా నానబెట్టిన మెంతులను నీటితో పాటు సేవించడం

వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది.మలబద్ధకం సమస్య ఉన్నవారు 2–3 చెంచాల నానబెట్టిన మెంతులను తింటే విరేచనం సాఫీగా అవుతుంది.జ్వరం, గొంతునొప్పి తగ్గించడానికి మెంతులు, తేనె, నిమ్మరసం కలిపిన కషాయం ఉపశమనం ఇస్తుంది. ఈ విధంగా మెంతులు మనకు తెలియని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటిని సరైన రీతిలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. ఆరోగ్యకరమైన జీవనం కోసం మెంతులను మీ దినచర్యలో చేర్చుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.. ముందుగా రాత్రి పూట మెంతులను నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంతోపాటు.. తినవచ్చు.. లేదా మెంతుల పొడిని నీటిలో మరిగించి తీసుకోవచ్చు.. లేకపోతే.. మెంతికూరను మీ ఆహారంలో జోడించుకోండి..

## షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?



మనం సాయంత్రం పూట చిరుతిండిగా తీసుకునే స్వీట్ కార్న్ రుచిగా ఉండటమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కానీ షుగర్ ఉన్నవారు మాత్రం దీని విషయంలో గందరగోళానికి గురవుతుంటారు. మొక్కజొన్నలో సహజంగానే చక్కెరలు ఉంటాయని.. అది ఆరోగ్యానికి హాని చేస్తుందని కొందరు నమ్ముతారు. ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ ఉఎ స్కోరు 52–55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి. అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం. ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం. కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.

# టీ20 వరల్డ్ కప్: పాకిస్థాన్ ఖాతాలో మరో విజయం

- టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు వరుసగా రెండో గెలుపు
- అమెరికాపై 32 పరుగుల తేడాతో ఘన విజయం
- అర్ధశతకంతో చెలరేగిన పాక్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్
- పోరాడి ఓడిన అమెరికా.. వృథా అయిన శుభమ్ రంజానె హాఫ్ సెంచరీ




టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ విజయాల పరంపర కొనసాగిస్తోంది. తన తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై నెగ్గిన పాక్, మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లోనూ అమెరికాపై 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్-ఏలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్, నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 73 పరుగులు) మెరుపు అర్ధశతకంతో చెలరేగగా, బాబర్ ఆజమ్ (32 బంతుల్లో 46) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో షాదాబ్ ఖాన్ (12 బంతుల్లో 30) వేగంగా పరుగులు సాధించడంతో పాక్ భారీ స్కోరు చేయగలిగింది. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ 25 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 191 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా గట్టిగానే పోరాడింది. శుభమ్ రంజానె (30 బంతుల్లో 51), షయాన్ జహంగీర్ (34 బంతుల్లో 49) అద్భుతంగా రాణించారు. అయితే, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరమైంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాక్ బౌలర్లలో ఉస్మాన్ తారిఖ్ 3 వికెట్లు తీయగా, షాదాబ్ ఖాన్ 2 వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. అంతకుముందు టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకుంది.

# 174.. వికెట్ పడకుండా

## రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్

## యూఏఈపై కివీస్ ఘనవిజయం

## మెరిసిన సీఫర్ట్, అలెన్

జట్టంతా కష్టపడితే.. 20 ఓవర్లు ఆడి 173 పరుగులు చేసింది యూఏఈ. నెమ్మదిగా ఉండే చెన్నై పిచ్‌పై న్యూజిలాండ్‌కు ఛేదన అంత తేలిక కాదేమో అనిపించింది. కానీ మ్యాచ్ 16 ఓవర్లలోపే అయిపోయింది. ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన ఓపెనర్లు సీఫర్ట్, అలెన్.. కివీస్‌కు అదిరే విజయాన్ని అందించారు. మంగళవారం గ్రూప్-డి మ్యాచ్‌లో మొదట యూఏఈ 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. కెప్టెన్ మహ్మద్ వసీమ్ (66 నాటౌట్; 45 బంతుల్లో 4ఐ4, 3ఐ6), షరాఫు (55; 47 బంతుల్లో 5ఐ4, 2ఐ6) సత్తా చాటారు. హెన్రీ రెండు.. డఫీ, ఫెర్గూసన్, శాంట్నర్, ఫిలిప్స్ తలో వికెట్ తీశారు. ఛేదనలో సీఫర్ట్ (89 నాటౌట్; 42 బంతుల్లో 12ఐ4, 3ఐ6), అలెన్ (84 నాటౌట్; 50 బంతుల్లో 5ఐ4, 5ఐ6) మెరుపులతో కివీస్ 15.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని అందుకుంది. టోర్నీలో న్యూజిలాండ్‌కు ఇది వరుసగా రెండో విజయం. సీఫర్ట్, అలెన్ బాదుడు: ఛేదనలో ఆరంభం నుంచి సీఫర్ట్, అలెన్ మెరుపులు మెరిపించారు. రెండో ఓవర్లో సీఫర్ట్ రెండు ఫోర్లు, అలెన్ ఒక ఫోర్‌తో బాదుడు షురూ చేశారు. జునైద్ వేసిన నాలుగో ఓవర్లో అలెన్ రెండు సిక్సులు.. సీఫర్ట్ రెండు బౌండరీలతో దూకుడు మరింత పెంచారు. ఈ జంట బాదుడే లక్ష్యంగా సాగడంతో పవర్‌ప్లే ముగిసే సమయానికి కివీస్ 78/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. పవర్ ప్లే తర్వాతా సీఫర్ట్, అలెన్ తగ్గలేదు. దొరికిన బంతిని దొరికినట్లు బాదేశారు. ఈ క్రమంలోనే సీఫర్ట్ 23 బంతుల్లో.. అలెన్ 27 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు. అర్ధసెంచరీల తర్వాతా ఈ ఇద్దరూ ధాటిని కొనసాగించడంతో కివీస్ 28 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని అందుకుంది. అంతకుముందు మహ్మద్ వసీమ్, షరాఫు రాణించడంతో యూఏఈ మెరుగైన స్కోరు చేసింది. 12 పరుగులకే తొలి వికెట్ పడినా.. వసీమ్, షరాఫు జంట రెండో వికెట్‌కు 107 పరుగులు జోడించి యూఏఈ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. అలీషాన్ ఔటైనా.. మయాంక్ (21) జతగా వసీమ్ స్కోరును 170 దాటించాడు. ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో యూఏఈ 2 సిక్సులు, 2 ఫోర్లు సహా 27 పరుగులు రాబట్టింది.



**యూఏఈ ఇన్నింగ్స్:** ఆర్యాంశ్ శర్మ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 8; మహ్మద్ వసీమ్ నాటౌట్ 66; షరాఫు (సి) మిచెల్ (బి) శాంట్నర్ 55; హర్షిత్ (సి) నీషమ్ (బి) ఫిలిప్స్ 2; మయాంక్ కుమార్ (సి) శాంట్నర్ (బి) ఫెర్గూసన్ 21; షోయబ్ ఖాన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 7; మహ్మద్ అర్ఫాన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; ఎక్స్‌ట్రాలు 14 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173; వికెట్ల పతనం: 1-12, 2-119, 3-124, 4-164, 5-173, 6-173; బౌలింగ్: హెన్రీ 4-0-37-2; డఫీ 2-0-16-1; ఫెర్గూసన్ 4-0-35-1; శాంట్నర్ 4-0-23-1; రచిన్ రవీంద్ర 3-0-19-0; నీషమ్ 1-0-7-0; ఫిలిప్స్ 2-0-30-1

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** సీఫర్ట్ నాటౌట్ 89; అలెన్ నాటౌట్ 84; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (15.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా) 175; బౌలింగ్: హైదర్ అలీ 4-0-27-0; మహ్మద్ రోహిద్ 3.2-0-51-0; జునైద్ సిద్ధిఖి 4-0-47-0; ధ్రువ్ పరాశర్ 1-0-14-0; మహ్మద్ అర్ఫాన్ 3-0-36-0



# సుకుమార్ సినిమాకు చరణ్ టార్గెట్?



టాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ అండ్ స్టార్ డైరెక్టర్లలో సుకుమార్ కూడా ఒకరు. తన సినిమాలతో ఆడియన్స్ ను మెప్పించే సుకుమార్ పుష్ప, పుష్ప2 సినిమాలతో దేశ వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఈ రెండు సినిమాల కోసం సుకుమార్ తన కెరీర్లో చాలా సమయాన్నే వెచ్చించారు. టైమ్ తీసుకున్నా సరే దానికి తగ్గ ఫలితాన్ని ఆ సినిమాలతో సుకుమార్ అందుకున్నారు.

### సుకుమార్ మూవీ కోసం రెడీ అవుతున్న చరణ్

అల్లు అర్జున్ తో పుష్ప, పుష్ప2 సినిమాలు చేసి మంచి డిమాండ్ ఏర్పరచుకున్న సుకుమార్ తన తర్వాతి సినిమాను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చింది. మరోవైపు చరణ్ కూడా తాను ప్రస్తుతం చేస్తున్న పెద్ది సినిమాను పూర్తి చేసి, సుకుమార్ సినిమాను చేయానికి సిద్ధమవుతున్నారు.

### జులై లేదా ఆగస్టులో మొదలవనున్న షూటింగ్

సుకుమార్, రామ్ చరణ్ కలయికలో గతంలో రంగస్థలం అనే సినిమా వచ్చి అది బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ మూవీపై అందరికీ విపరీతమైన అంచనాలున్నాయి. చరణ్ కెరీర్లో ఈ ప్రాజెక్టు 17వ సినిమాగా తెరకెక్కుతుండగా, ఈ మూవీ షూటింగ్ జులై లేదా ఆగస్ట్ నెలల్లో స్టార్ట్ అవనున్నట్టు తెలుస్తోంది.

### ఏడాది లోపే పూర్తి చేయాలని టార్గెట్

అయితే ఈ ప్రాజెక్టు గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ తెలుస్తోంది. ఈ సినిమాను రామ్ చరణ్ సంవత్సరం లోపే పూర్తి చేయాలనుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. ఏడాది కంటే ఎక్కువ టైమ్ పట్టే సినిమాలను ఇకపై చేయడానికి రామ్ చరణ్ ఆసక్తి చూపడం లేదని, సినిమాలు ఎక్కువ చేయాలనే ఉద్దేశంతోనే చరణ్ ఈ డెసిషన్ తీసుకున్నారని అంటున్నారు. గేమ్ ఛేంజర్ కోసం కెరీర్లో ఎంతో టైమ్ ను వృథా చేసుకున్న చరణ్ ఇకపై అలాంటి తప్పులు చేయకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అదే నిజమైతే సుకుమార్ సినిమా నెక్ట్స్ ఇయర్ ఆగస్ట్ కు రిలీజయ్యే ఛాన్సుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

### మార్చి 27న పెద్ది రిలీజ్

ఆర్సీ17 ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేసిన సుకుమార్, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ లో బిజీగా ఉన్నారని, ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక పెద్ది విషయానికొస్తే బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా మార్చి 27న పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com